


## కొడవటిగంటి కుటుంబరావు

---

వాటిని సుడిగుండాలనండి, ఊబి అనండి, జీవితంలో కొన్నికొన్ని స్థానాలున్నై. మనిషి అక్కడ కాలు పెట్టకుండా వాటిని తప్పించుకు తిరుగు తున్నంతసేపే అదృష్టవంతుడు. తన పొరపాటు వల్ల కానీ మరొకరి పొరపాటు వల్ల కానీ అక్కడ అడుగు పెట్టాడో, సత్యనారాయణకు పట్టిన గతే పడుతుంది. అనాదిగా వస్తున్న నియమాలు మొదలైనవన్నీ జీవితాన్ని హైరోడ్డు మీదికి పట్టించే ఉద్దేశంతో ఏర్పరచ బడ్డవే. వస్తుతహా వివేకం కలవాడు ఆనియమాలకు దాసోహం అనక పోయినా అంత ఇబ్బంది లేదు కాని, లోకజ్ఞానం లేక పుటకలోనే దృష్టిమాంద్యం కలవాడు వాటిని గౌరవిస్తేనే బతికి పోతాడు.

మా కామయ్య తాత ఆదెమ్మ డబ్బు చూసి తన కడసారి పిల్లవాణ్ణి ఆమెకు పెంపు డిచ్చాడు. ఆదెమ్మ మంచి చెడ్డలతో నాకు ప్రసక్తి లేదు, ఆ విషయం ఎటు కావాలంటే అటు వాదించగలను. కాని మాసత్తాయి నావిడకు దత్తు చెయ్యటం ఒక విధంగా పొరపాటు కాదు,— లక్షవిధాల.

మొదటి సంగతి ఆవిడ అంతఃకరణ బంగారమే కానివ్వండి, ఆవిడ ప్రవర్తన పదిమందీ ఆమోదించి నటువంటిది కాదు. మా తాత చూడబోతే ఆయన కున్నంత లోకభీతి ఎవరికీ ఉండబోదు. ఆదెమ్మ ఒకరితో ప్రమేయం లేకుండా ముక్కుసూటిగా పోను కొని పొయ్యే మనిషి. ఆవిడ మీద మొగుడికి ఇంతిం తనరాని మమకారం ఉండేది. కారణ మేమిటో పరమాత్మకు తెలియాలి. మొగుడు పెళ్లాల మధ్య ఆగర్భాధానం నాడేం జరిగిందో మరి, ఆయన బతికున్న అయిదారేళ్లు కూడా ఆవిడ మొగుణ్ణి అంత దూరాన ఉంచింది. ఆయన పొడ గిట్టేది కాదావిడకు. మరి ఆ ముండాకొడుకు ఏంనోము నోచుకున్నాడో, చచ్చేవరకూ ఆయన కావిడ మీద ప్రేమ పోనేలేదు. పెళ్లాం తన్ను దూరంగా ఉంచుతున్నందుకు ఎప్పుడూ ఖేదించేవాడు, అప్పుడప్పుడూ, కోప్పడే వాడు, చుట్టుపక్కల ఇళ్ల వాళ్లందరికీ తెలిసేటట్టు నాటకం ఆడేవాడు, విరక్తి చెందేవాడు, మళ్లీ కాళ్ల మీద పడి బతిమాలేవాడు. ఈ ప్రకారంగా గానుగ చుట్టూ తిరిగి వచ్చేవాడే కాని మరేమీ జరిగేది కాదు. ఏనాటి పగో, మొగుడి, స్వర్గం తన అరిచేతులో పెట్టి ముడుచుకుని, ఆయన పడే తాపం కళ్లారా చూస్తూ కూడా ఆదెమ్మ తన చిటికెన వేలన్నా సళ్లు విడవలేదు. ఆయన కష్టాలు గట్టెక్కి ఆయన గతించాడు. ఆస్తి యావత్తూ పెళ్లాం పేర పెట్టేసి ఆవిడయిష్టాను సారం

చేసుకునే హక్కిచ్చాడు. పెళ్లాం పేర ఒక ఉత్తరం కూడా వ్రాశాడని ప్రతీతి, తనకూ భార్యకూ ఎటువంటి సంబంధమూ లేకుండా పోవటానికి తనదే తప్పనీ, (అతప్పెటువంటిదో !) తను ఎంత త్వరగా చచ్చిపోతే పెళ్లాని కంతన్యాయం చేసిన వాడవు తాడనీ, ఆదెమ్మ తిరిగి వివాహం చేసుకుని సుఖపడ గలందులకు ఆస్తి యావత్తూ ఆవిడ పరం చేస్తున్నాడని. ఈ పుకారు ఎంతవరకు నిజమో నేను చెప్పలేను, ఉత్తరం దేనను కొనే వాళ్ల ననేక మందిని నేను స్వయంగా ఎరుగుదును. మొగుడు పోయిన మీదట ఆదెమ్మ జుట్టు తీయించ లేదు, రెండో పూట భోజనం మాన లేదు. తిరిగి పెళ్లాడ లేదు. అందరూ ఊహించినట్టు బజారునా పళ్లేదు. మా సత్తాయిని మాత్రం పెంచుకుంది.

కామయ్య తాత ఇదంతా విని కూడా పిల్లవాణ్ణి పెంపకం ఇచ్చాడు. అంతే కాదు. ఆదెమ్మ సత్తాయి కన్న అయిదేళ్లు మాత్రమే పెద్దది, (వీడికి పదహారు, ఆవిడకు ఇరవై పయినా) ఆవిడ అసాధారణమైన సౌందర్యం కలది. (అందు కేమీ సందేహంలేదు. అందచందాలు తెలీని నన్నట్లా ఉంచి, కేవలం ఈ విషయం లోనే ప్రవేశం కల వాళ్లు చాలామంది ఈ మాట ఆమోదించారు.)

మూడో సంగతి, సత్తాయి వివేకహీనుడు. చెయ్యగూడని పనులు చెయ్యటంలోనూ, మాటిమాటికీ పప్పులో కాలు వెయ్యటం లోనూ గొప్ప చెయ్యి. క్లిష్ట పరిస్థితులు వచ్చినయ్యంటే రావూ ? మా సత్తాయి ఎంత "చత్వారం" కల వాడంటే, తన కంటె నాలుగైదేళ్లు పెద్దదాన్ని "అమ్మా!" అని సంబోధించటం వాడికేమీ పట్టివ్వలేదు సరీ కాదా, ఆవిడ దగ్గిరుండే పలకబోతే చెవికోసిన పిట్టల్లే ఇంకొంచెం బిగ్గిరిగా ఇంకా నాలుగుసార్లు పిలిచే వాడు. అప్పుడావిడ తన వంక అదోరకంగా చూసేదిట, వాడే చెబుతాడు !

దత్తత అయిన వెంటనే ఉపనయనమూ పెళ్లీకూడా చేసేసింది ఆదెమ్మ సత్తాయికి. వాడి పెళ్లాం కూడా చిలకంటి పిల్ల.

"నీకు 'అమ్మా' అని పిలవటం ఎట్లా అలవాటయిందీ, మీ అమ్మ నీ నెలల్లో పోతే? మీవాళ్లల్లో ఎవరినన్నా అట్లా పిలిచే వాడివా? పిలవకపోతే నీ కిప్పుడు కొత్తగా లేదూ ?" అని ఆవిడ అడిగేది.

వాడు గర్వంగా "నాకేం కొత్తలేదు !" అనే వాడు.

"నన్ను అమ్మా అని పిలవొద్దు" అని ఆవిడ శాసించ లేదు. మరేమని పిలవ మనాలి ? అందుకనేమో.

పెళ్లయిన కొద్ది రోజులకే సత్తాయి కాలేజి చదువుకు పోయి నాడు. రెండేళ్లు గడిచింది. తరవాత చదువు గుంటూరులో లేక రాజమండ్రి వెళ్లవలిసి వచ్చింది. వెళ్లాడు. అక్కడి తిండి పడలేదు. రోగం వచ్చి మంచాన పడ్డాడు. ఆదెమ్మ ఈ మాట వింటూనే డబ్బు తీసుకొని రాజమండ్రి వెళ్లింది. అక్కడే కాపరం పెట్టింది. ఇంటి తిండీ, వారం వారం తలంటీ, ఆడదాని పెట్టుపోతలూ——వాడికి హాయిగానె ఉంది కాని, వాడు మంచంలో ఉండగా ఉపచారం చేసిన నాటి నించీ ఆదెమ్మ వాడి దగ్గిర స్వేచ్ఛ తీసుకోవటం మొదలు పెట్టింది. తరుచుగా వాడుపడుకున్న మంచం మీద కూర్చోటం, మొహం తుడవటం, తనే తలకు నూనే రాచి పాపడతియ్యటం మొదలైనవి చెయ్యటం మొదలు పెట్టింది.

వాడి నిద్ర మత్తు బుద్ధి కెక్కడో కాస్త వేడి తగిలింది కాని కథలో సోమరి పోతల్లే పక్కను పొర్లి మళ్లీ నిద్ర పోయింది.

ఒకనాడు సాయంకాలం వాడింటికి వచ్చి తల్లిని చూసి ఆశ్చర్య పోయినాడు. ఆదెమ్మ చక్కగా జడ వేసుకొని కొండి చుట్ట చుట్టు కుంది. ఏమిటిది అని అడగటానికి వాడికి నోరురాలేదు. వేసుకుంటే వేసుకుంది లెమ్మను కున్నాడు.

భోజనానంతరం వాడు పడుకుని చదువుకుంటుంటే వచ్చి నవ్వుతూ “సత్యం” నేను జడేసుకుంటే బాగుందా?” అంది.

వాడు దీర్ఘంగా యోజించి “బాగానే ఉంద” న్నాడు.

“మంచి చీర కట్టుకుంటే ఇంకా బాగుంటుంది ఉండు!” అని లోపలికి పరిగెత్తింది.

కొంచెం సేపటికి వంట ఇంట్లో నించి “అక్కడనే ఉన్నావు కాదూ? చీర కట్టుకుంటున్నా!” అన్నదావిడ.

వాడు మళ్లీ కొంచెంసేపాలోచించి “ఆ!” అన్నాడు.

ఆదెమ్మ త్వరలోనే మల్లెపువ్వల్లే తయారై వచ్చింది.

భోజనానంతరం వాడు పడుకుని చదువుకుంటుంటే చీరపువ్వని అనే వ్యక్తి, మనిషి అంతదూరాన ఉండగానే కమ్మని వాసన రావటం కూడా మొదలు పెట్టింది మా వాడికి. ఆదెమ్మ నేరుగా తన దగ్గిరికి వచ్చి మంచం మీద కూర్చున్న తరవాత ఆవిడ మొహాన బొట్టు కుడా గమనించాడు వాడు.

కాలానికేదో విపరీతం పుట్టిం దనుకున్నాడు సత్తాయి. కాని వాడి కప్పటికైనా ఆవిడ అభిప్రాయం తెలేదు.

ఆదెమ్మ వాడి మొహం మీద వెంట్రుకలు పైకి తోస్తూ “తాంబూలం వేసుకుందామా?” అంది. ఆ ప్రశ్న వాడికి వినపడక, గుడ్లు పెట్టుకు చూడటం మొదలు పెట్టాడు.

ఆదెమ్మ మృదువుగా “ఎందు కట్లా చూస్తావు” అంది. ఆ మాట వాడి చెవికెక్క లేదు. మెల్లిగా మోచేయి వాడి పొట్ట మీద పెట్టి ముంజేతిని వాడి మీద పెట్టేసింది. తరవాత మెల్లిగా వాడి మీదికి వాలి తన మొహం వాడి మొహంమీద పెట్టి “ఏం సత్యం. జవాబు చెప్పవూ!” అంది ప్రశ్న కాకుండా.

వాడు పలికే స్థితిలో లేడు. ఏ మాట కామాటే, ఆమె తన ప్రాణం తీసినా వారించే స్థితిలో లేడు.

ఇదిసామాన్యపు, ఉభయ పార్టీల ప్రయత్నం మీద జరిగే రంకుతనం కాదు. కొంచెం మొగటుగా ఉంటుంది కాని ఆదెమ్మ మా వాణ్ణి చెరిచిందని చెప్పవచ్చును. ఆవిడ కా పరిస్థితిలో ఉన్నదే స్వేచ్ఛ. ఇటువంటి విషయాలను గురించి వాడికేమీ తెలీక పోవటంలో ఆవిడ స్వేచ్ఛ ఇంతకు పదింతలయింది. వాడికి వేడెక్కి ఒళ్లు పరవశమయే దాకా ముద్దు పెట్టుకుంది. వాణ్ణి తన చేతులోకి తీసుకుని తనకేసి అదుముకుంది. ఎన్నివిధాల రెచ్చగొట్టాలో అన్ని విధాలా రెచ్చగొట్టింది. రాళ్లంటివి అగుగాకై. సత్తాయి వంటి స్తబ్ధు సయితం స్వాతంత్రించగల స్థితిలోకి వచ్చాడు.

కోరికా, ఉద్రేకమూ తృప్తి ఆదెమ్మ వంతు. మావాడికి ఉద్రేకం తప్ప మిగిలినవి లేవు. ఆ కాస్త ఉద్రేకమూ చల్లారగానే వాడికి భూమ్యాకాశాల మధ్య ఉన్నట్టుండి సిబయ్య మాదిరిగా మొహాన్ని చేతులతో కప్పుకుని ఏడవటం మొదలు పెట్టాడు. వాడి లోపల ఏదో తెగింది—ఇంగ్లీషు వాళ్లన్నట్టు, కనీసం తెగినట్టు భావించాడు. ఆదెమ్మ వంక చూడటం కాని మాట్లాడటం కాని అసంభవమైంది.

ఆదెమ్మ పక్క మీదినించి లేచి మంచం పక్క ఏడుస్తున్న సత్తాయిని చూస్తూ నుంచుంది కొంతసేపు. “నీ కేమైంది, సత్యం? ఎందుకు— ” ఏడుస్తున్నా వన్న మాట అనటం ఉచితంగా ఉండదని మానేసి ఉంటుంది.

“పొరపాటయింది! ఇహ ఎప్పుడూ నీజోలికి రాను!”

సత్యంగాడు జవాబు చెప్పలేదు. ఆవిడ వెళ్లి తన మంచం మీద పడుకుంది.

తాత్కాలికంగానైనా సత్తాయికి చేసిన పనికి పశ్చాత్తాపం పరిపూర్ణంగా వచ్చింది. తత్సంబంధమైన పవిత్ర భావంతో జరిగిందంతా నాతో పూస గుచ్చి నట్లు చెప్పాడు.

౨౦౯

ఈ సంఘటన మీద నేను వ్యాఖ్యానం చెయ్యలేని దుస్థితిలో ఉన్నాను. ఆదెమ్మ చేసిన పని సరయిన దని వాదించటం నాకు చాతకాదు. ఆదెమ్మను విడిచేసిన దాన్నిగా ఊహించుకో లేకుండానూ ఉన్నాను. ఈ రెండు విషయాలూ ఇట్లా ఉండగా నాకు ఆడదాని మనస్తత్వం ఏమీ తెలీదని కూడా ఒప్పుకో వలిసి ఉంది.

కాళ్లా వేళ్లా పడ్డ మొగుణ్ణి దగ్గిరికి రానివ్వని మనిషి, ప్రపంచజ్ఞానం లేని సత్యంగాణ్ణి ఎట్లా వరించిందో— అందుట్లో మా ప్రభువు!—నా కర్థం కాదు. నిజంగా ఆమె వాడి యెడల భార్యమాదిరిగా తన్నుతాను భావించుకుంటే అట్లా ప్రవర్తించటం తన దృష్టి తప్ప మరోగోల లేని ఆడదానికి, ఆశ్చర్యం కాదు. మా వాడి వైపున అప్పటికి ప్రేమ అన్నది ఎంత మాత్రమూ లేదని ఖచ్చితంగా చెప్ప గలను.

మొత్తం మీద ఆదెమ్మ తన మాట దక్కించుకుంది. ఆ తరువాత ఆమె వాడి జోలికి పోలేదు. ఇందులో కూడా నాకు కొంత సుగుణం కనిపిస్తుంది. ఎందుచేతంటే, వాడికి కలిగిన పశ్చాత్తాపం స్మశానవైరాగ్యం శ్రేణికి చెందినది. మర్నాడా వేళకు మళ్లీ ఆవిడ చేత వంచించబడటానికి వాడు సిద్ధంగానే ఉండి ఉండాలి. వాడికీ కొత్తపరిస్థితులు కాస్త అలవాటు కావటమే ఉన్న అడ్డమల్లా. అటువంటప్పుడు ఆమె వాణ్ణి దాని కలవాటు చెయ్యాలని ప్రయత్నం చెయ్య లేదంటే, ఆమెకు వాడి మీద కొంత ఆపేక్ష ఉందనీ, కాదు మళ్లీ రోదనం ప్రారంభిస్తే భరించ లేక తను ఎడంగా పోయిం దనీ నాకు నమ్మటానికి సులభంగా ఉంది. ఆవిడ ఎడంగా పోవటమే కాదు, దూరాన్నించి వాణ్ణి ఆకర్షించాలని కూడా ఆవిడ వాడి కష్టసుఖాలు ప్రతి స్వల్పవిషయంలోనూ కనిపెడుతూ వాడి మనస్సు నొచ్చుకోకుండా ప్రవర్తించింది కూడాను. ఏ చిత్రాంగి మోస్తరుగానో ఆవిడ ప్రేమ వికారంగా మారినట్టయితే మా వాడి పని ఏంకావల్లో అదయేది!


ఇది జరిగిన ఆరునెల్లకు మా వాడి భార్య రత్నం కాపరానికి వచ్చింది. ఆ పిల్లను (పేరు రత్తమ్మ, కొంచెం నాజూకుగా రత్నం!) నేను పెళ్లప్పుడు చూశాను, కాపరానికి వచ్చిన కొత్తలోనూ చూశాను. మొహం వెనకటి మొహమే గాని, చూడముచ్చటగా లేదు. పెళ్లి నాటికి హృదయంలో లేని—అంకురమాత్రంగా ఉంటే ఉందేమో!— విషవృక్షం ఒకటి తన ఛాయను మొహం మీదికి పరిచింది. ఆ పిల్లను చూస్తూనే ఎవర్నీ సుఖపెట్ట గల పిల్ల కాదనుకున్నాను. మా వాడు స్వయంగానే కనుక్కున్నాడు!

మా నిద్దరమత్తు మొహాన్ని ఆదెమ్మ కదిలించ లేక పోయింది కాని రత్నం ఒక్క కొరడా దెబ్బతో వాడిలో చైతన్యం కలిగించింది. ఆ పిల్లతో పరిచయమైన రెండు మూడు రోజుల్లోనే వాడికి ఆమెను చూస్తే ఒక విధమైన భయమూ, పిల్ల ఎదురుగా వళ్లు దగ్గిర పెట్టుకుని ప్రవర్తించటమూ అబ్బినై. రత్నం కళ్లో కూడా వాడు ఊహించని ప్రశ్నలు వేసేది వాణ్ణి. పెద్దమనిషైన వాళ్లు ఒకరికొకరు బయటపెట్టుకోటానికి వెరిచే భావాలు ఆ పిల్ల బయటికి అనేసేది. మా వాడు నాకు ప్రత్యేకించి ఉదాహరణ లివ్వ లేదు కాని ఊహించుకో గలను!...

వాడు రెండు నెల్లు కాబోలు ఓర్పుగా పెళ్లాంతో కాపరం చేశాడు—కనీసం ప్రయత్నించాడు. లాభం లేక పోయింది. చివరకు పెళ్లాం వంటి మీద చెయ్యి వెయ్యటం కూడా అవాచ్యమైన కంపు తినమల్లే భావించేట్టు చేసింది రత్నం వాణ్ణి. ఆపిల్లకు ప్రతి దానికీ నిరసనే. "నా కసహ్యం!" అనే ముక్క ఎప్పుడూ నాలిక మీద తాండవమాడేది. వెండి కంచాల్లో అన్నం తినటం అసహ్యం. మొగుడన్నం తిన్న చోటికి గజం లోపల తన విస్తరి వేసుకోటం అసహ్యం. ఆదెమ్మను చూస్తే డోకు. మొగుణ్ణి చూసినా అంతే ననుకో వచ్చును—అతని బట్టలు, అలవాట్లు, అభిప్రాయాలు మొదలైనవన్నీ డోక్. కనక: అటువంటి మనిషిని వాడెన్నడూ చూడలేదు. వాడెరిగినంతవరకు ఆ పిల్ల అసహ్యించుకోని ఒక మనిషి గాని, విషయం గాని, వస్తువు గాని లేదు. ఇంత విశాల ప్రపంచంలో ఆమె గౌరవానికి పాత్రమైనదీ,

ఆమెకు సంతోషం గాని, నవ్వు గాని పుట్టించేదీ లేనే లేదు.

చీడ పురుగల్లే రత్నం మొగుణ్ణి మైలపరిచింది. వాడికీ ప్రతిదాన్నీ చూస్తే అసహ్యం పుట్టింది. వెనకటి నమ్మకాల మీదా, పూర్వపు తన మీదా వాడికి పూర్తిగా ద్వేషం పుట్టింది. మనల్ని ఒక స్తంభానికి కట్టేసి ప్రపంచంలో చూడ దగిన వాటి నన్నిటినీ చూపి ఆనందించమంటే ఎంత ఆనందించగలమో, వాడి మెడకు రత్నమ్మను కట్టి జీవితం లో ఉన్న శోభ చూడమంటే అంత చూడ గలడు. వాడి దృష్టికి అడ్డంగా నుంచున్న రత్తమ్మే జీవిత స్వరూపమనుకుని జీవితాన్ని వాడు మనసారా ద్వేషించాడు. ఈ తుపాను మధ్య ఆదెమ్మ నిశ్చలంగా కనపడ్డది. ఏడుస్తూ ఆమెను వదిలి పెట్టి వచ్చిన వాడు మళ్లీ కళ్ల నీళ్లతో ఆమె దగ్గరికి వెళ్లాడు. ఆమె చెయ్యి తన నుదురు మీద పడగానే సంధించిన వాడి మొహాన ఉడుకులాం పట్టీ వేసి నట్టయింది. వాడి తల ఆవిడ తన రొమ్ము మీద పెట్టుకుంటే వాడి ఆత్మకు చల్లగా ఉంది.



"నీకు డబ్బు సహాయం చేసి, నా శరీరం అర్పించి, నేను సంపూర్ణంగా నీ దాన్నయి, నిన్ను కష్టపెట్టాను, సత్యం. నీ పెళ్లాం ఇవ్వటానికి ఏమీ లేక, ఉన్నదేదో దాచుకుని నిన్ను బాధిస్తున్నదా? ఎంత దురదృష్టవంతుడివి!" అంది ఆదెమ్మ.

మా వాడు ఆదెమ్మ చెయ్యి తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు. ఆ క్షణంలో వాడావిణ్ణి తల్లి మాదిరిగా చూశాడో పెళ్లా మాదిరిగా చూశాడో వాడికే తెలేదు. తల్లి నెవరైనా ముద్దు పెట్టుకుంటారా? పెళ్లాని అట్లా ఉద్రేకం లేకుండా ముద్దు పెట్టుకోగలరా?

ఆ స్థితిలో ఇద్దర్నీ చూసింది రత్తమ్మ. రత్తమ్మను ఆదెమ్మ కూడా చూసింది కాని కంగారు పడలేదు.

రత్తమ్మే లోకానికి తెలియజేసింది తల్లికొడుకులకు యిలాకా ఉందని!...

పిసుగా విరామం లేకుండా అన్ని నరకాలకు అర్హత సంపాదించుకున్న వాళ్లు సయితం ఆ ఇద్దర్నీ వేలు పెట్టి చూపిస్తున్నా, అనేక వేలమంది తమను గురించి ఆడి పోసుకుంటున్నా మా వాడికి కష్టం కన్న, రత్తమ్మ వదిలి పోయిందన్న సంతోషం జాస్తిగా ఉందన్నాడు.

ఆదెమ్మా మా వాడూ విడిగా ఉంటున్నారు. వాళ్లిద్దరూ స్వేచ్ఛగా భార్యాభర్తలల్లే కాపరం చేస్తున్నారని నే నెరుగుదును. మా స్తబ్బు—వాడిప్పుడంత స్తబ్బుగా కూడా కనపడడు, చిత్రం. అందంగా తగిన ఆడది ఉన్న తరవాత మగవాడికంత బలం కామల్లు!—నాతో అంతా చెప్పతూనే ఉంటాడుగా! కాని ఎందుకో నాకా ఇద్దరూ కనపడ్డప్పుడల్లా తల్లికొడుకులల్లే ఉంటారు. కారణం చెప్పలేను. దూరం నించి "ఆఁ! వాణ్ణి మరిగి తల్లి ముండ కొడుల్ని నల్ల గొట్టిందిలే!" అంటే "కాదు. ముఖాముఖి ఇద్దర్నీ చూసి తల్లికొడుకులు కారని ఎవరైనా—పరిశుద్ధ

మైన అంతఃకరణ కలవాళ్లు—అనుకోగలరా? నే నను-
కుంటాను గదా, వాళ్లిద్దరికీ రెండు రకాల సంబంధం
ఉన్నా, ఒకటే లోకానికి కనపడుతున్నది. రెండోది
అదృశ్యం, అది మూడోకంటివాడికి తెలిసేది కాదేమో!”


నే నప్పుడప్పుడూ వాళ్లింటో మేస్తుంటాను. ఈ
ముక్క మాత్రం బయటికి రానివ్వకండి!—పుట్టగతులుం
డవు.—


## MADRAS DENTAL COLLEGE

### 285, China Bazaar, Road, Madras

Final Year Students with the Principal, Dr. H. VENKAT RAO, L. M & S. & his **Assistans,**

FREE TREATMENT FOR THE POOR.



మద్రాస్ డెంటల్ కాలేజి, 285, చైనాబజారు రోడ్డు, మద్రాసు

ప్రిన్సిపాల్ డాక్టరు H. వెంకటరావుగారు, L. M & S. అంత్య తరగతి విద్యార్థులు సహోపాధ్యాయులు.

బీదలకు ఉచిత వైద్యము.